RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 107

మంగళవారం
మార్చి 18, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00

www.vedhanews.in

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యల పరిష్కారమే మా
ఎజెండా..ఇంత కాలం మేము ప్రచురించిన
కథనాలే అందుకు ఉదాహరణ..
నిజమైన, నిఖార్సైన జర్నలిజానికి వేదికగా
నిలుస్తున్న 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో
నిజాలు రాసి నిఖార్సైన జర్నలిస్టుగా
రాణించాలనుకునే
వారికి ఇదే మా ఆహ్వానం..

9701923260,
9701920379

## బీసీలకు రిజర్వేషన్లు కల్పించేలా

# రాజ్యాంగ సవరణ జరగాలి..



**పార్లమెంటులో చట్టం కోసం మోదీ, రాహుల్‌గాంధీని కలుద్దామని పిలుపు**

**వేద న్యూస్, హైదరాబాద్ :**

బలహీన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడానికి రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అందుకు నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. ఈ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే వరకు విశ్రమించేది లేదని శాసనసభ వేదికగా స్పష్టం చేశారు. బలహీన వర్గాలకు విద్య, ఉద్యోగ, అలాగే రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి సంబంధించి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభలో ప్రతిపాదించిన రెండు వేర్వేరు బిల్లుపై ముఖ్యమంత్రి మాట్లాడారు. ఈసారి 4 ఎమ్మెల్సీ స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీలకే ఇచ్చామని ఆయన గుర్తు చేశారు. 1979లో మండల్ కమిషన్ వేశారని, మండల్ కమిషన్‌తోనే బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత ప్రారంభమైందని సీఎం అన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతామని కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించామని గుర్తు చేశారు. కులగణన, బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ఏడాదిలోపు ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై మద్దతు ఇస్తున్న అందరికీ సీఎం ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం నుంచి అంగీకారం కోసం పోరాడుతానన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని కలిసేందుకు అన్ని పార్టీల నేతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించేలా రాజ్యాంగ సవరణ జరగాలని వెల్లడించారు. అవసరమైన రాజ్యాంగ సవరణ జరిగేలా అందరం కలిసి పోరాడుదామని, పార్లమెంటులో చట్టం కోసం మోదీ, రాహుల్‌గాంధీని కలుద్దామని అన్నారు.

# పన్నుల సేకరణలో నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలి

- ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి
- గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డాక్టర్ అశ్వినితానాజీ వాఖడే



**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**

ఆస్తి, నల్లా పన్నుల వసూళ్లలో నిర్దేశిత లక్ష్యాన్ని అంకిత భావంతో సాధించాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం మేయర్ జిడబ్ల్యూఎంసి కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖేడ్‌తో కలిసి 2024 -25 ఆర్థిక సంవత్సరంలో పన్నుల సేకరణ, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కరణ పురోగతిని, రంజాన్ పండుగ సందర్భంగా బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాట్లపై సమీక్షించి వేగవంతంగా నిర్వహించుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ కమిషనర్లు పన్నుల సేకరణపై సర్కిళ్ల వారీగా సమీక్షిస్తూ 2024 -25 ఆర్థిక సంవత్సరంలో 118.06 కోట్ల రూపాయల సేకరణ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 51 శాతంతో 60.17 కోట్ల రూపాయలు సేకరించడం జరిగిందని అన్నారు. నీటి పన్ను లక్ష్యం రూ 30.18 కోట్లు కాగా, కేవలం 79 లక్షల రూపాయలు సేకరించడం జరిగిందన్నారు. పన్నుల వసూళ్లకు కేవలం పక్షం రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నదని, కనీసం 85 శాతం పన్నుల సేకరణే లక్ష్యంగా అంకిత భావంతో సమష్టిగా కృషి చేయాలన్నారు. కాజిపేట్, కాశిబుగ్గ సర్కిళ్ల పరిధిలో ప్రతి సర్కిల్ నుండి గుర్తించిన వంద మంది బడా బకాయిదారులకు రెడ్ నోటీసులు ఇదివరకు అందజేయడం జరిగిందని, పన్ను చెల్లించని పక్షంలో నిబంధనల మేరకు కఠినంగా వ్యవహరించి ప్రాపర్టీస్ లను సీజ్ చేయాలని ఆదేశించారు. కమర్షియల్,అపార్ట్మెంట్స్, రెసిడెన్షియల్ లలో పెండింగ్ లో ఉన్న నల్లా పన్ను చెల్లించని వారిని వెంటపడి సేకరించాలని ఆదేశించారు. నగర ప్రజలు ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రభుత్వం కల్పించిన సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేయర్ కోరారు. 26 ఆగస్టు 2020 కు ముందు కచ్చా లే అవుట్ చేసినవారు వాటిలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు, ఎల్ ఆర్ ఎస్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారు ముందుకు వచ్చి 25శాతం రిబేట్ తో ఈనెల 31 తేదీలోగా ఫీజులు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని అన్నారు. జిడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖేడ్ మాట్లాడుతూ బల్దియా పరిధిలో ఏర్పాటుచేసిన పది హెల్ప్ డెస్క్ ల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు ఎల్ ఆర్ ఎస్ పై వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ త్వరితంగా ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోన, ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, సీఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇన్చార్జిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, ప్రసన్న రాణి, రాజేశ్వర్, టాక్సేషన్ ఆఫీసర్ రామకృష్ణ, ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్, రెవెన్యూ, తదితర విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై

# శ్రీవారి దర్శనం

**వేద న్యూస్, డెస్క్:**

తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం కల్పించేందుకు అనుమతించనున్నట్లుగా తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. ఈ మేరకు టీటీడీఓ ఒక ప్రకటన విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటనలో పేర్కొంది. కాగా తెలంగాణ నేతల సిఫార్సు లేఖలపై ఆదివారం, సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉంటాయని టీటీడీ వెల్లడించింది. బుధవారం, గురువారం ప్రత్యేక ప్రవేశ దర్శనాలు(రూ.300) ఉంటాయని తిరుమల తిరుపతి దేవస్థానం తెలిపింది. నిర్దేశిత రోజుల్లో ప్రజాప్రతినిధులకు సంబంధించి ఒక లేఖ మాత్రమే స్వీకరిస్తామని వెల్లడించింది. మార్చి 24 నుంచి అమలు చేయనున్నట్లు టీటీడీ వెల్లడించింది. ఒకరికి ఒక సిఫార్సు లేఖను మాత్రమే 6 మందికి మించకుండా స్వీకరించడం జరుగుతుందని అందులో పేర్కొంది. తిరుమలలో అందుబాటులో ఉన్న వసతి సౌకర్యాలను, ఇతర భక్తుల దర్శన సమయాలను దృష్టిలో ఉంచుకుని చర్చించి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం నిర్ణయం తీసుకున్నట్లుగా వెల్లడించింది.

## బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న

# 12మందిపై కేసులు

**వేద న్యూస్, హైదరాబాద్ :**

బెట్టింగ్ యాప్లపై తెలంగాణ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా ఆ యాప్లను ప్రమోట్ చేస్తున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లతో పాటు పలువురు టీవీ నటులపై కేసులు నమోదయ్యాయి. ఇమ్రాన్‌ఖాన్, హర్షసాయి, టేస్టీ తేజ, కిరణ్ గౌడ్, విష్ణుప్రియ, శ్యామల, రీతూ చౌదరి, సుప్రీత, అజయ్, సన్నీ యాదవ్, సుధీర్, సందీప్ లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిపై బీఎన్ఎస్-318(4) 3,3(ఏ), 4టీఎస్‌జీఏ, 66డీఐటీఏ-2008 సెక్షన్ల కింద కేసు నమోదయ్యాయి. ఆన్లైన్ బెట్టింగ్ యాప్లను సోషల్ మీడియా వేదికగా ఇటీవల కాలంలో కొంత మంది సోషల్ మీడియా ఇన్ఫ్లూయన్సర్లు ప్రచారం చేస్తున్నారు. వాటివల్ల అమాయక యువత తప్పుదోవ పట్టి డబ్బులను నష్టపోతున్నారు. ఇలాంటి వాటివల్ల సమాజానికి జరిగేనష్టం ఎక్కువగా ఉంటుందని గుర్తించారు ఆర్టీసీ ఎండీ సజ్జనార్. బెట్టింగ్యాప్ ప్రచారాలతో యువతను తప్పుదోవ పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ నెల 21న సజ్జనార్ తో సహా కొంతమంది సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజాగా బెట్టింగ్ యాప్లు ప్రమోట్చేస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేయడం విశేషం.

# పొట్టి శ్రీరాములు పేరు తీస్తే ఊరుకోం..

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ ప్రభుత్వం తెలుగు యూనివర్శిటీకి పొట్టి శ్రీరాములు పేరు తొలగించి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలన్న నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. తెలుగు యూనివర్శిటీకి పొట్టి శ్రీరాములు పేరు తీసేయడాన్ని బీజేపీ ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్త తప్పుబట్టారు. ప్రభుత్వం నిర్ణయంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. ' పొట్టి శ్రీరాములు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నాం. పొట్టి శ్రీరాములు అంటే గుర్తుకొచ్చేది యూనివర్సిటీ. ఆయన ఒక ప్రాంతానికి చెందినవారు కాదు. గాంధీతో అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. కులం, జాతి కోసం పనిచేసిన వ్యక్తి కాదు. దేవాలయాల్లోకి అందరికీ అనుమతి ఉండాలని కోరిన వ్యక్తి. బాషపరమైన పునాది ఉందంటే అది పొట్టి శ్రీరాములు ఘనతే. నిరంకుశ పాలనకు.. రజాకారులకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి సురవరం ప్రతాపరెడ్డి. ఆయన పేరు ఉస్మానియా యూనివర్సిటీకి పెట్టాలని మా డిమాండ్. శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మేము ఖండిస్తున్నాం. ఆర్యవైశ్యులకు ఆరాధ్య దైవం పొట్టిశ్రీరాములు. ఆర్యవైశ్యులు మృధు స్వభావులు. ఆర్యవైశ్యుల డిమాండ్స్ నెరవేర్చకపోతే ప్రభుత్వంపై ఉద్యమం చేస్తాం. చర్లపల్లికి పేరు తీయడం ఎందుకు,పెట్టడం ఎందుకు. ఆర్యవైశ్యుల మనోభావాలు దెబ్బతీయకుండా ప్రభుత్వం చూడాలి' అని అన్నారు. అంతకు ముందు తెలుగు యూనివర్శిటీ పేరు మార్పుపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. పేరును ఎందుకు మార్చాల్సి వచ్చిందో వివరించారు. పేరు మార్పు తెలంగాణ ఆత్మ గౌరవానికి సంబంధించినదని అన్నారు. తెలంగాణ కోసం పని చేసిన వారిని స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకే పేరు మార్చుతున్నట్లు తెలిపారు. తెలంగాణకు అసలు భాషనే లేదన్న సందర్భంలో గోల్కొండ పత్రిక ప్రారంభించి కవులను ఏకతాటిపైకి తెచ్చి నడిపించారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సురవరం ప్రతాపరెడ్డి సేవ మరువలేనిదన్నారు.

### అమరావతిలో 58 అడుగుల విగ్రహం

అమరావతిలో భారీ పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం 58 రోజులపాటు కఠోర దీక్ష చేపట్టి, ఆత్మ బలిదానం చేసిన పొట్టి శ్రీరాములు స్మారకంగా 58 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. పొట్టి శ్రీరాములు స్వగ్రామమైన పడమటిపల్లిలోని నివాసాన్ని మ్యూజియంగా మారుస్తామన్నారు. నెల్లూరుకు పొట్టి శ్రీరాములు పేరును పెట్టింది తామేనన్నారు.

## ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజీవ్ యువ వికాసం

# నేటి నుంచి దరఖాస్తులు

**వేద న్యూస్, శాయంపేట :**

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టి, బీసీ నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాస పథకం పేరుతో ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట ప్రభుత్వం నిర్ణయించింది. రాజీవ్ యువ వికాసం స్కీమ్ వచ్చే నెల 5వ తేదీ వరకు tgobmms.cgg.gov.in% వెబ్ సైటు ద్వారా ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని బిసి కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి మల్లయ్య బట్టు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కోసం ఇతర వివరాలు సంబంధిత వెబ్ సైటులో ఉంటాయని వెల్లడించారు. ఇతర వివరాల కోసం జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసును సంప్రదించాలని సూచించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం తీసుకొచ్చింది దీని ద్వారా ఒక్కో లబ్ధిదారునికి గరిష్టంగా 3 లక్షల రూపాయల వరకు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది.

# కలకలం రేపుతున్న విజయసాయిరెడ్డి లీక్స్

విజయవాడ : వైసీపీ హయాంలో మద్యం సరఫరాలో అవకతవకలు జరిగాయని టీడీపీ ఆరోపిస్తుంటే.. అలాంటిదేమీ లేదు.. అంతా పారదర్శకంగానే జరిగిందని వైసీపీ గట్టిగా వాదిస్తోంది. ఇలాంటి టైమ్‌లో.. విజయసాయి రెడ్డి పేల్చిన లిక్కర్ బాంబ్.. ఆంధ్రా పాలిటిక్స్‌ని కుదిపేస్తోంది.నిప్పు లేనిదే పొగ రాదు. ఎంతో కొంత నిజం లేనిదే.. విమర్శలు, ఆరోపణలు రావు! ఇప్పుడు.. ఏపీలో లిక్కర్ స్కామ్ గురించి వినిపిస్తున్న చర్చలు, నాయకుల మాటలు వింటుంటే.. ఇదే అనిపిస్తోంది. ఏపీలో గత ప్రభుత్వ హయాంలో లిక్కర్ స్కామ్ జరిగిందని టీడీపీ బలంగా చెబుతుంటే.. అలాంటిదేమీ లేదని వైసీపీ చెబుతూ వస్తోంది. ఈ విషయంలో రెండు పార్టీలు దెబ్బలాడుకుంటున్న సమయంలో.. వైసీపీలో కీలకంగా పనిచేసిన విజయసాయి రెడ్డి చేసిన వ్యాఖ్యలు.. ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ఇప్పటివరకు ఈ లిక్కర్ స్కామ్ విషయంలో కొంత కన్ఫ్యూజన్ ఉన్నా.. విజయసాయి రెడ్డి చెప్పిన మాటలు విన్నాక.. తెరలన్నీ తొలగిపోతున్నట్లనిపిస్తోంది.విజయసాయి రెడ్డి వెర్షన్. ఇందులో.. ఇంకో డౌటే అవసరం లేదు. తమ హయాంలో మద్యం సరఫరాలో అవకతవకలే జరగలేదని వైసీపీ గట్టిగా వాదిస్తున్న సమయంలో.. విజయసాయి రెడ్డి పేల్చిన లిక్కర్ బాంబ్ ఆ పార్టీలో కలకలం రేపుతోంది. లిక్కర్ స్కామ్‌లో.. కర్త, కర్మ, క్రియ అంతా కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డేనని తేల్చి చెప్పేశారు. మద్యం సరఫరా అవకతవకల్లో.. పాత్రధారి, సూత్రధారి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డేనన్నారు. దాంతో.. లిక్కర్ విషయంలో టీడీపీ ఆరోపిస్తున్నట్లుగా.. స్కామ్ జరిగిందనే విషయాన్ని విజయసాయి చెప్పకనే చెప్పారనే చర్చ జరుగుతోంది.ఇప్పటికే.. ఈ వ్యవహారానికి సంబంధించి సీఐడీ కేసు నమోదు చేసింది. దానిపై.. వేగంగా దర్యాప్తు కొనసాగుతోంది. ఎఫ్ఐఆర్‌లోనూ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేరు ఉంది. పైగా.. ఇతను వైసీపీ హయాంలో ఐటీ సలహాదారుగా పనిచేశారు. ఆ పార్టీలో కీలక నేతగానూ, పార్టీ పెద్దలకు సన్నిహితుడిగానూ కసిరెడ్డికి పేరుంది. అతని కనుసన్నల్లోనే లిక్కర్ స్కామ్ జరిగిందని విజయసాయి రెడ్డి చెప్పడంతో.. ఏపీలో నెక్ట్స్ ఏం జరగబోతోందనేది ఆసక్తి రేపుతోంది. అంతేకాదు.. లిక్కర్ స్కామ్‌కు సంబంధించి త్వరలోనే మరిన్ని విషయాలు బయటపెడతానని చెప్పడం కూడా.. పొలిటికల్‌గా మరింత హీట్ రేపుతోంది.వైసీపీ హయాంలో లిక్కర్ పాలసీపై.. శాసనమండలిలోనూ అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం నడిచింది. గత ప్రభుత్వంలో మద్యం అమ్మకాల్లో అవకతవకలు జరిగాయని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. సిట్ విచారణకు ఆదేశించిన వెంటనే కీలక పత్రాలు తగలబెట్టేశారన్న ఆరోపణల్ని.. వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఖండించారు.వైసీపీ ప్రభుత్వంలో వేల కోట్ల మేర లిక్కర్ స్కామ్ జరిగిందనేది కూటమి నేతల ప్రధాన ఆరోపణ. దీనిపై.. ఇప్పటికే ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి ప్రత్యేక విచారణ జరుపుతోంది. ఈ కేసులో వైసీపీలోని కొందరు ముఖ్య నేతల పాత్ర ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు విజయసాయి రెడ్డి మరో కీలక వ్యక్తి పేరు బయటపెట్టారు. దాంతో.. ఏపీలో లిక్కర్ స్కామ్ జరిగిందనే విషయం దాదాపుగా క్లియర్ అయిపోయింది. ఎందుకంటే.. గత ప్రభుత్వంలో విజయసాయి రెడ్డి కీలకంగా పనిచేశారు. ఆయనకు అన్నీ తెలుసని.. కీలక ఆధారాలు సైతం ఆయన దగ్గర ఉండొచ్చని అనుమానిస్తున్నారు.రాజకీయాలకు దూరంగా ఉంటానని చెప్పిన విజయసాయి రెడ్డి.. వైసీపీ హయాంలో రహస్యాల గుట్టు మొత్తం విప్పేస్తున్నారనే చర్చ కూడా సాగుతోంది. దాంతో.. వైసీపీలోని కీలక నేతలకు చిక్కులు తప్పవంటున్నారు. ప్రధానంగా.. ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లు ఏమీ లేకుండా.. డిస్టిలరీల నుంచి నేరుగా మద్యం తెచ్చి అమ్ముకున్నారని.. అలా వేల కోట్లు వెనకేశారనే ఆరోపణలున్నాయి. ఇప్పుడు.. వాటికి బలం చేకూర్చేలా విజయసాయి రెడ్డి వ్యాఖ్యలు చేయడం.. వైసీపీలో కలకలం రేపుతోంది. ఇదే సమయంలో.. రాష్ట్ర రాజకీయాల్లోనూ.. ఈ వ్యవహారం హాట్ డిబేట్‌గా మారింది.కొత్త లిక్కర్ పాలసీ, దశలవారీగా మద్య నిషేధం, ప్రభుత్వమే వైన్ షాపులు నిర్వహించే విధానం ముసుగులో.. వైసీపీ పెద్దలు భారీ కుంభకోణానికి పాల్పడ్డారనేది.. చాలా రోజులుగా వినిపిస్తున్న ప్రధానమైన ఆరోపణ. ఈ లిక్కర్ స్కామ్‌లో.. పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి కీలకంగా వ్యవహరించారని ఆరోపణలు కూడా ఉన్నాయి. డిస్టిలరీస్‌ని చేజిక్కించుకోవడం నుంచి కొత్త బ్రాండ్ల తయారీ దాకా అంతా మాఫియా తరహాలో జరిగిందనే వాదనలున్నాయి. అసలు లిక్కర్ స్కామ్ విషయంలో.. వైసీపీ ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోపణలేంటి? నెక్ట్స్ ఏం జరగబోతోంది?ఏపీ లిక్కర్ స్కామ్‌లో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిదే ప్రధాన పాత్ర అని తెలుగుదేశం నేతలు గట్టిగా ఆరోపిస్తున్నారు. మద్యం కంపెనీలతో సంప్రదింపులు జరపడం, అడిగినన్ని ముడుపులు ఇచ్చేందుకు అంగీకరించిన సంస్థలకే.. లిక్కర్ సప్లై ఆర్డర్లు దక్కేలా చూడటం, వారి నుంచి వసూలు చేసిన ముడుపుల్ని.. బిగ్ బాస్‌కు చేర్చడంలో.. మిథున్ రెడ్డే కీలకంగా వ్యవహరించారని ఆరోపిస్తున్నారు. ఇందుకోసం.. వైసీపీ హయంలో ఐటీ శాఖ సలహాదారుగా పనిచేసిన.. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని ముందుపెట్టి.. భారీ నెట్‌వర్క్ రన్ చేశారని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఒక్కో మద్యం కేసుకు.. 150 నుంచి 450 వరకు వసూలు చేశారంటున్నారు. ఈ లెక్కన.. నెలకు 60 కోట్ల చొప్పున నాలుగేళ్లలో 3 వేల కోట్లు కొల్లగొట్టారని తెలుగుదేశం నేతలు ఆరోపిస్తున్నారు.ఈ వసూళ్ల నెట్‌వర్క్ రూపకల్పన, అది పక్కాగా అమలయ్యేలా చూడటం వెనుక మాస్టర్ మైండ్.. ఎంపీ మిథున్ రెడ్డేనని టీడీపీ నేతలు అంటున్నారు. లిక్కర్ కంపెనీల నుంచి కొనుగోలు చేసిన మద్యానికి.. బేసిక్ రేటుని అడ్డగోలుగా పెంచేసి.. అనుచిత లబ్ధి పొందారని అంటున్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకొని.. ఈ స్కామ్‌ని అంతా తానై నడిపించారని చెబుతున్నారు. అంతేకాదు.. డిస్టిలరీల్లో పాగా వేసి.. వివిధ బ్రాండ్ల మద్యం తయారుచేయించి.. వాటికే అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు ఇప్పించుకున్నారని ఆరోపిస్తున్నారు.వైసీపీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే.. ఏపీలో అతిపెద్ద డిస్టిలరీల్లో ఒకటైన నంద్యాలలోని.. ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌తో పాటు మరో డిస్టిలరీని అనధికారికంగా ఆయన గుప్పిట్లోకి తెచ్చుకున్నారని.. అక్కడే పెద్ద ఎత్తున కొత్త బ్రాండ్లు తయారు చేయించారని ఆరోపిస్తున్నారు. వాటికే.. 2701 కోట్ల విలువైన మద్యం సరఫరా ఆర్డర్లు కట్టబెట్టారని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ బేవరేజెస్ కార్పొరేషన్ దగ్గర మొత్తం 235 మద్యం సరఫరా కంపెనీలు నమోదై ఉన్నాయి. అందులో 168 ఏపీలోనివే. వాటిలో.. కేవలం ఏడు సంస్థలకే 9221 కోట్ల విలువైన మద్యం సరఫరా ఆర్డర్లు ఇచ్చారు.అంటే.. 7 సంస్థలకే 60 శాతం విలువైన ఆర్డర్లు కట్టబెట్టారనే విమర్శలున్నాయి. వీటిలో.. అత్యధికంగా గత సర్కార్ పెద్దలకు అస్మదీయ కంపెనీలుగా ఉన్నవాటికి, ముడుపులు చెల్లించిన సంస్థలకేనని.. తెలుగుదేశం నేతలు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా.. అదాన్ డిస్టిలరీస్.. విజయసాయి రెడ్డి అల్లుడైన రోహిత్ రెడ్డి బినామీ సంస్థ అనే ఫిర్యాదులు కూడా ఉన్నాయ్. దీనికి సొంతంగా ఒక్క డిస్టిలరీ లేదు. విశాఖ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్, పీఎంకే డిస్టిలేషన్, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌ని.. సబ్ లీజు పేరిట ఆధీనంలోకి తీసుకొని.. అక్కడ ఉత్పత్తి చేసిన బ్రాండ్లను.. ఈ అదాన్ డిస్టిలరీస్ సంస్థ సరఫరా చేసినట్లుగా తెలుస్తోంది.మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్న సంస్థల నుంచి ముడుపుల వసూళ్లకు కూడా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని టీడీపీ ఆరోపిస్తోంది. ఈ చెల్లింపుల వ్యవహారాలు చూసేందుకు ప్రతి లిక్కర్ కంపెనీ, డిస్టిలరీ సంస్థ నుంచి ఒకరిని ప్రతినిధిగా నియమించుకున్నారట. అతను.. తనకు బాగా నమ్మకస్తులైన ఇద్దరు, ముగ్గురిని క్యాష్ హ్యాండ్లర్లుగా నియమించుకొని.. వారికి ముడుపుల సొత్తు అప్పజెప్పేవారట. వాళ్లు.. ఇందులో కీలకంగా ఉన్నటువంటి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి నియమించిన కొరియర్లకు సొత్తు అప్పగించేవారని చెబుతున్నారు. ఎప్పుడూ ఒకేచోట కాకుండా.. వేర్వేరు ప్రాంతాల్లో ముడుపులు అందజేసేవారని.. ఎప్పటికప్పుడు ఫోన్ నెంబర్లు మార్చేసే వారని అంటున్నారు.ఇక.. ఈ సొమ్ము మొత్తాన్ని ఒక చోటుకు చేర్చేందుకు.. ఓ కీలక వ్యక్తిని ఆర్గనైజర్‌గా నియమించారని.. ఆ నగదు మొత్తాన్ని కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి చేర్చేవారని అంటున్నారు.అతని దగ్గర్నుంచి.. పార్టీలోని మరో కీలక నేతకు వెళ్లేదంటున్నారు.అలా వచ్చిన బ్లాక్ మనీని వివిధ రూపాల్లోకి మార్చి..బిగ్ బాస్‌కు చేర్చేవారనే ఆరోపణలున్నాయి. ఇప్పుడు.. వైసీపీలో కీలకంగా పనిచేసి.. పార్టీకి దూరమైన విజయసాయి రెడ్డికూడా లిక్కర్ స్కామ్‌లో పాత్రధారి, సూత్రధారి అంతా కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డేనని చెప్పడం కూడా ఏపీ రాజకీయాల్లో కలకలం రేపుతోంది. ఏదేమైనా.. లిక్కర్ స్కామ్ జరిగిందా? లేదా? అనే విషయంలో.. విజయసాయి మాటలతో కొంత క్లారిటీ అయితే వచ్చేసింది. సిట్ దర్యాప్తుతో.. అతి త్వరలోనే అసలు విషయంలో ఏపీ అంతటా రీసౌండ్‌లో వినిపిస్తుందనే చర్చ సాగుతోంది.

# ఇంటర్ ఎడ్యుకేషన్‌లో కీలక మార్పులు

రాజమండ్రి : ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోధనలో కీలక సంస్కరణలకు బోర్డు అమోదం తెలిపింది. ఇంటర్మీయట్‌లో ప్రస్తుతం ఉన్న మ్యాథ్స్ ఎ-బిలు ఇకపై ఒకే సబ్జెక్టుగా, బాటనీ-జువాలజీలను ఒకే సబ్జెక్టుగా బోధిస్తారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇది అమల్లోకి రానుంది. ఏప్రిల్ 1 నుంచి ఇంటర్ తరగతులు మొదలవుతాయి.ఇంటర్ విద్యా బోధనలో కీలక సంస్కరణలో ఏపీ ఇంటర్ బోర్డు అమోదం తెలిపింది. విస్తృత ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం ఇంటర్మీడియట్ బోర్డులో సంస్కరణలకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పచ్చజెండా ఊపారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ 77వ సమావేశం అమరావతి అసెంబ్లీలోని పేషిలో మంత్రి లోకేష్ అధ్యక్షతన నిర్వహించారు.ఇంటర్మీడియట్ లో విద్యలో నాణ్యత ప్రమాణాలను పెంపొందించి విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కాలేజిలవైపు ఆకర్షించేలా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజిల విద్యార్థులను తయారుచేసేందుకు 2025-26 విద్యాసంవత్సరం నుంచి క్యాలెండర్ లో మార్పులు చేపట్టారు.ఈ విద్యా సంవత్సరం నుంచి ఏపీలో ఇంటర్ జూన్ 1వతేదీకి బదులుగా ఏప్రిల్ 1 నుంచే ప్రభుత్వ కళాశాలలు ప్రారంభమవుతాయి. జూన్ 1 వ తేదీకి బదులుగా ఏప్రిల్ 7 నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభిస్తారు.2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులకు వార్షిక పరీక్షలను మార్చి 2026కి బదులుగా ఫిబ్రవరి చివరి వారం నుంచే నిర్వహిస్తారు. ట్యాబులేషన్ రిజిస్టర్లను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలని నిర్ణయించారు. డిజిలాకర్, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సజావుగా ఆన్‌లైన్ యాక్సెస్ ఉండేలా 1973 నుండి 2003 వరకు ఇంటర్మీడియట్ బోర్డు ఫలితాల డేటాను డిజిటలైజ్ చేస్తారు.ఇంటర్ లో చేరే విద్యార్థులకు సబ్జెక్టుల ఎంపికలో సౌలభ్యాన్ని పెంచి, బహుళవిభాగ అభ్యాసాలను ప్రోత్సహించడానికి ఈ విద్యాసంవత్సరం నుంచే మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎలక్టివ్ సబ్జెక్టులను 2వ సబ్జెక్టుగా ప్రవేశపెట్టనున్నారు. లాంగ్వేజెస్, సైన్స్, హ్యూమానిటీస్ విభాగాల్లోని 24 ఆప్షన్స్ లో ఒక సబ్జెక్టును 2వ సబ్జెక్టుగా ఎంపిక చేసుకోవచ్చు.జూనియర్ కళాశాలల్లో ఎంబైపిసి ప్రవేశపెట్టాలనే ప్రజల డిమాండ్ కు అనుగుణంగా ఈ విద్యాసంవత్సరం నుంచి మ్యాథ్స్, బయాలజీ సబ్జెక్టులు అంతర్భాగాలుగా 6 సబ్జెక్టులతో ఎం.బైపిసి కోర్సును ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు 14 సబ్జెక్టులకు (సైన్స్, హ్యూమానిటీస్, లాంగ్వేజెస్ సహా) సవరించిన సిలబస్తో కొత్త పాఠ్యపుస్తకాలు ఈ విద్యా సంవత్సరం నుంచే అమలులోకి వస్తాయి.ఇంటర్మీడియట్ లో ఇప్పటివరకు రెండు సబ్జెక్టులుగా పరిగణిస్తున్న మ్యాథ్స్ ఎ, బిలను ఇకపై ఒకే సబ్జెక్టుగా విలీనం చేశారు. అలాగే బైపిసి విద్యార్థులకు బాటనీ, జువాలజీలు కలిపి ఒకే సబ్జెక్టు ఉండేలా విలీనం చేశారు. ఈ విలీనం వల్ల ఆయా సబ్జెక్టులకు సమాన వెయిటేజీ లభిస్తుంది.ఈఏపిసెట్, జెఇఇ, నీట్ వంటి పరీక్షలకు ప్రభుత్వ కళాశాలల విద్యార్థులను సన్నద్ధం చేయడానికి సమగ్ర పోటీ పరీక్షల కోచింగ్ మెటీరియల్‌ను ఇంటర్మీడియట్ బోర్డు తయారు చేస్తుంది. ఈ మెటీరియల్ బోర్డు పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మెటీరియల్ ను ఉచితంగా అందజేస్తారు.కాంపిటీటివ్ బేస్డ్ ఎసెస్‌మెంట్ కోసం ఇంటర్మీడిటయట్, సైన్స్, హ్యూమనిటీస్ విభాగాలప్రశ్నల్లో 10% తప్పనిసరిగా బహుళ-ఎంపిక ప్రశ్నలు, ఖాళీలను పూరించే రూపంలో ఒక మార్కు ప్రశ్నలు ఉండేలా కొశ్చన్ పేపర్ రూపొందించాలని నిర్ణయించారు. స్థాయి ప్రకారం సిలబస్ సవరణ, వృత్తి విద్యార్థుల కోసం డ్యుయల్ సర్టిఫికేషన్ ను ప్రవేశపెట్టనున్నారు. నైపుణ్య పర్యావరణ వ్యవస్థను మెరుగుపరచడానికి వీలుగా ప్రమాణాలను నిర్ణయించారు. సమగ్ర నిబంధనలను అభివృద్ధి చేయడం, వృత్తిపరమైన సిలబస్‌ను మెరుగుపరచడం కోసం భారత ప్రభుత్వ జాతీయ మండలితో సహకరించేలా ప్రణాళిక రూపొందించారు.వృత్తిపరమైన కోర్సుల పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు పరిశ్రమలకు అవసరాలకు తగ్గట్టుగా సవరించడానికి వీలుగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటయ్యే పరిశ్రమలతో ఒప్పందాలు చేసుకోవాలని నిర్ణయించారు.

# రజనీ.. రోజా... నెక్ట్స్ ఎవరు...

గుంటూరు : ఆంధ్రప్రదేశ్ లో వైసిపి నేతల అవినీతి వ్యవహారాలపై అధికారులు రాష్ట్ర ప్రభుత్వం గట్టిగానే ఫోకస్ పెట్టారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు చెలరేగిపోయిన నాయకులపై ఇప్పుడు చంద్రబాబు నాయుడు గట్టిగా దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. మాజీ మంత్రుల అవినీతి వ్యవహారాలపై లెక్కలు తేల్చేందుకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. చిత్తూరు జిల్లాకు చెందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. త్వరలోనే ఆయనను అదుపులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయని వార్తలు వస్తున్నాయి.తాజాగా వైసీపీ మాజీ రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి పై కూడా సిఐడి అధికారులు ఫోకస్ పెట్టారు. ఇక ఇప్పుడు మాజీ మంత్రి ఆర్కే రోజాపై గట్టి ఫోకస్ పెట్టింది రాష్ట్ర ప్రభుత్వం. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఇష్టం వచ్చినట్టు మాట్లాడిన ఆర్కే రోజా.. అవినీతి వ్యవహారాల్లో కూడా అదే దూకుడు ప్రదర్శించారనే ప్రచారం అప్పట్లో పెద్ద ఎత్తున జరిగింది.ప్రధానంగా ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమంలో ఆమె క్రీడా శాఖ మంత్రిగా పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడ్డారనే ఆరోపణలు అప్పట్లో టిడిపి నేతలు చేశారు. ఇక టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమెపై కఠిన చర్యలు ఉండే అవకాశం ఉందని అంచనా వేశారు. అయితే రోజా విషయంలో ఇప్పటివరకు అధికారులు ఎక్కడా దూకుడు ప్రదర్శించలేదు. అటు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆమె విషయంలో సైలెంట్ గానే ఉండిపోయింది. ఇక తాజాగా దీనిపై చంద్రబాబు సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది.గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఆడుదాం ఆంధ్ర పేరుతో భారీగా నిధులు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు రావడంతో.. రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దీనిపై సోమవారం కూడా అసెంబ్లీలో చర్చ జరిగింది. దాదాపు 119 కోట్ల నిధులు ఆడదాం ఆంధ్ర పేరుతో దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. ముఖ్యంగా బ్యాట్లు అలాగే క్రికెట్ కిట్లు కొనే విషయంలో ఆర్కే రోజా అవినీతికి పాల్పడ్డారు అని ఆరోపణలు వినిపించాయి. నాసిరకం క్రికెట్ బ్యాట్లను అప్పట్లో పంపిణీ చేశారని క్రీడాకారులు కూడా ఆరోపించారు.దీనిపై పలు వీడియోలు కూడా సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. ఇప్పుడు వాటన్నింటినీ బయటకుతీసి అవినీతి వ్యవహారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. అటు మరో మాజీ మంత్రి విడదల రజనీపై కూడా కేసుల నమోదు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. దీనిపై గవర్నర్ అనుమతి తీసుకునేందుకు కూడా సిఐడి అధికారులు ఇప్పటికే ఒక లేఖ కూడా రాశారు.

# బాబుపై కేడర్ గుర్రు...లోకేశ్ తో షేర్

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విషయంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నట్లు కనపడుతుంది. ఆ పార్టీ సోషల్ మీడియా లో పోస్టులు చూస్తుంటే ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. చంద్రబాబు నాయుడు బీజేపీకి మరింత లొంగిపోవాల్సిన అవసరం ఏముందని పలువురు ముఖ్య కార్యకర్తలు కూడా ప్రశ్నిస్తున్నారు. అందుకు ప్రధాన కారణం సోము వీర్రాజును ఎమ్మెల్సీగా ఎంపిక చేయడమే. బీజేపీ సభ్యుడే అయినప్పటికీ తమ మద్దతు లేకపోతే బీజేపీ కనీసం ప్రతిపాదనకు అవసరమైన సంఖ్యాబలం కూడా లేదన్నది కార్యకర్తల వాదన. అలాంటి సమయంలో గతంలో తమపై వ్యతిరేకంగా వ్యవహరించిన సోము వీర్రాజును ఎమ్మెల్సీగా ఎంపిక చేస్తుంటే ఎందుకు ఊరుకున్నారని ప్రశ్నిస్తున్నారు. నిజానికి ఎమ్మెల్సీ అభ్యర్థులను ఖరారు చేసే ముందు చంద్రబాబు నాయుడు ఈ నెలలో ఢిల్లీకి వెళ్లి వచ్చారు. అక్కడ అమిత్ షాను కలసి వచ్చారు. అప్పుడే సోము వీర్రాజు పేరు వచ్చినట్లు చెబుతున్నారు. అయితే చంద్రబాబు నాయుడు ఒకింత అభ్యంతరం చెప్పినప్పటికీ తమ పార్టీ వ్యవహారమని, ఇందులో తమకు సహకరించాలని అమిత్ షా కోరడంతో చంద్రబాబు తప్పనిసరి పరిస్థితుల్లో అంగీకరించాల్సి వచ్చిందని ముఖ్య నేతలు చెబుతున్నప్పటికీ కార్యకర్తలు మాత్రం వినడం లేదు. సోము వీర్రాజును చంద్రబాబు వ్యతిరేకిగానే తాము భావిస్తామని, ఆయన పదవి నుంచి తొలగిన తర్వాత మాత్రమే కూటమి ఏర్పడిందన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. రాజధాని అమరావతికి కూడా నాడు వ్యతిరేకంగానే సోము వీర్రాజు పావులు కదిపారని, అప్పుడు చలో అమరావతికి పవన్ కల్యాణ్ పిలుపు నిచ్చినా సోము వీర్రాజు కేంద్ర నాయకత్వంతో చెప్పి దానిని సమర్థంగా అడ్డుకోగలిగారన్న కామెంట్స్ కూడా వినపడుతున్నాయి. పైగా చంద్రబాబు వల్లనే ఏపీలో బీజేపీ బలోపేతం కాలేదన్న సోము వీర్రాజు కామెంట్స్ తో కూడిన వీడియోలు కూడా పోస్టు చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తికి సహకరించాల్సిన అవసరం ఏముందని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల పార్టీ కార్యకర్తల్లోనే కాదు ఓటు బ్యాంకు గా ఉన్న జనంలో కూడా కొంత అసంతృప్తి ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఇలాగే కొనసాగితే ఇంకెంత మందికి అవకాశాలు ఇస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. కేంద్రానికి మన అవసరం ఎంత ఉందో తెలియంది కాదని, అలాగే మనకూ కేంద్ర ప్రభుత్వం అవసరం ఉందని, అంత మాత్రాన లొంగిపోవడం ఎందుకని తెలుగుతమ్ముళ్లు ప్రశ్నిస్తున్నారు. ఈరోజు సోము వీర్రాజు వస్తారు. రేపు జీవీఎల్ వస్తారు. ఎల్లుండి విష్ణువర్ధన్ రెడ్డి రారన్న గ్యారంటీ ఏముందంటూ చంద్రబాబును క్యాడర్ ను నిలదీస్తుండటంతో నేతల నుంచి అధినాయకత్వం వరకూ తలలు పట్టుకుంటున్నారు. కేవలం నిధుల కోసం కేంద్రం వద్ద చేతులు కట్టుకుని కూర్చుకునే కంటే అభ్యంతరం చెప్పి మరొకరికి అవకాశం ఇప్పించి ఉంటే బాగుండేదని సూచించారు. మరికొందరు ఒక అడుగు ముందుకేసి చంద్రబాబు బీజేపీ చేతిలో బందీగా తయారయ్యారంటూ కూడా కామెంట్స్ పెడుతున్నారు. ఇది పార్టీ నాయకత్వానికి ఇబ్బందికరంగా మారిందనే చెప్పాలి. మంత్రి నారా లోకేశ్ కు ఎక్కువ మంది క్యాడర్ తమ మనసులో బాధను చెప్పుకుంటుండటం విశేషం.

# కెమెరా ముందు పులి... జైల్లో పిల్లి!

కడప : మీరు మారిపోయారు సార్'... ఒక సినిమాలో ఆయన డైలాగ్ ఎంత పాపులర్ అంటే? క్యారెక్టర్ మార్చుకున్న ప్రతి ఒక్కరి గురించి చెప్పే సమయంలో ఆ డైలాగ్ వాడుతున్నారు. బహుశా ఆయన కూడా ఊహించి ఉండరేమో... తన గురించి ఈ డైలాగు వాడే రోజు ఒకటి వస్తుందని! రెండు వారాల జైలు జీవితంలో ఆయనను చూసిన పోలీసులు, కోర్టులో ఆయన ప్రవర్తన గమనించిన జనాలు 'మీరు మారిపోయారు సార్' అంటున్నారు. 'వీధిలో పులి ఇంట్లో పిల్లి' అనే సామెత వినే ఉంటారు. గత ప్రభుత్వ హయాంలో కెమెరా ముందు ఆయన విశ్వరూపం చూసిన జనాలు, ఇప్పుడు జైలులో ఆయన ప్రవర్తన తెలిసిన మనుషులు చెప్పే మాట ఒక్కటే... 'కెమెరా ముందు పులి జైల్లో పిల్లి' అని. ప్రతి దానికి ఒక హద్దు ఉంటుంది. ఆ హద్దు మీరి ఆయన మాట్లాడిన సందర్భాలు తెలుగు ప్రజలకు ఇంకా గుర్తు. కెమెరా కనిపిస్తే చాలు... ఎవరి గురించి మాట్లాడుతున్నాం? ఏం మాట్లాడుతున్నాం? అనేది మరచి మహిళల గురించి తప్పుగా మాట్లాడిన రోజులు ఉన్నాయి.ఇప్పుడు ఆయన మెడకు మాటలు (తప్పులు) చాలా అంటే చాలా బలంగా చుట్టుకున్నాయి. మర్రిచెట్టు ఊడల్లా పెనవేసుకుపోయాయి. పీకేద్దాం అని ప్రయత్నించినా కుదరడం లేదు. కేసులు బలంగా ఉండటంతో జైలులో రెండు వారాలు గడపాల్సి వచ్చింది. దాంతో మనిషి బాగా కృంగిపోయాడని సమాచారం. కోర్టులో వెక్కి వెక్కి ఏడ్చినట్టు వార్తలు వచ్చాయి. కోర్టులో కంటే ముందు జైలులో ఏడ్చిన సందర్భాల్లో ఉన్నాయట. దాంతో 'కెమెరా ముందు పులి జైల్లో పిల్లి' అని ఆయన గురించి 'ఆఫ్ ది రికార్డ్' గుసగుసలు వినబడుతున్నాయి.రచయితగా ఆయనకు వందల సినిమాలు రాసిన అనుభవం ఉంది. నటుడిగానూ చాలా సినిమాలు చేశారు. ఐదు పదుల జీవితాన్ని చూశారు. అదంతా ఏమైందో ఏమో... అధికారం ఎవరి శాశ్వతం కాదని గుర్తించలేకపోయారో ఏమో?ఒక పార్టీకి, ఒక నాయకుడికి మద్దతు పలకడం తప్పు కాదు. అది వ్యక్తిగతం. రాజకీయాలలో పార్టీలు మారడం, తమ తమ అభిమాన నాయకులను మార్చడం సహజం. హీరోలు విలన్లు ఎవరూ లేరు ఈ నాటకంలో అని చెప్పినట్టు పరిస్థితులకు తగ్గట్టు చాలా మంది మారుతూ ఉంటారు. ఏ గట్టున ఉన్నా సరే నోరు అదుపులో పెట్టుకోవడం ముఖ్యం కదా!'వడ్డించే వాడు మనవాడు అయితే బంతిలో ఎక్కడ కూర్చున్నా పర్వాలేదు' అనేది ఒక సామెత. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఏం మాట్లాడినా చెల్లుతుంది. ఒక్కసారి అధికారం కోల్పోయిన తర్వాత చేసిన తప్పులకు శిక్ష అనుభవించాల్సి వస్తుందని లాజిక్ మర్చిపోతే ఎలా!? అందుకు చక్కటి ఉదాహరణ తాజా అరెస్ట్ అనేది రాజకీయ వర్గాలలో సైతం చర్చకు వస్తోంది.జైలు జీవితం సినిమాలలో చూపించినట్లు ఉండదని ఆయనకు బాగా అర్థం అయ్యిందట. కానిస్టేబుల్ క్యారెక్టర్ చేయడం వేరు, జైలులో ఉన్నప్పుడు కానిస్టేబుల్స్ మన పట్ల ప్రవర్తించే విధానం వేరని తెలిసి వచ్చిందట. దాంతో వెక్కి వెక్కి ఏడ్చినట్లు, గుక్క పెట్టినట్లు తెలుస్తోంది. రెండు వారాల జైలు జీవితం ఆయనలో జ్ఞానోదయం కలిగించిందో లేదో గానీ... మెంటల్ కృష్ణ మెంటల్లీ వెరీ వీక్ అంటున్నారు దగ్గర్నుంచి చూసిన జనాలు. కెమెరా ముందు మాట్లాడడం వేరు, మనల్ని ప్రశ్నించే వ్యక్తులు లేనప్పుడు ఇష్టం వచ్చినట్లు చెప్పడం వేరు... కేసులతో కోర్టుల చెట్టు తిరగడం వేరు, పోలీసులతో పాటు న్యాయమూర్తులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం వేరు. లాజిక్స్, లా పాయింట్స్ బయటకు తీసి ప్రశ్నలు అడుగుతుంటే బిక్క మొహం వేసే బదులు... ఆయనను చూసి కెమెరా ముందు రెచ్చిపోయే జనాలు ముందు జాగ్రత్త పడడం మంచిదనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకులలో వ్యక్తం అవుతోంది. ఇంతకీ ఆయన నిజంగా మారిపోయారా? లేదంటే బెయిలు బయటకు రావడం కోసం తనలో ఉన్న నటుడిని బయటకు తీసి నిజమనేట్టు నమ్మించారా!? వెయిట్ అండ్ సీ.

# వరుస యాక్సిడెంట్లు చేసిన డ్రైవర్‌ను పట్టుకున్న ట్రాఫిక్ ఎస్సై

హైదరాబాద్ : నగరంలో హిట్ అండ్ రన్ కేసు నమోదైంది. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ లోని జగద్గిరిగుట్ట, షాపూర్ లలో ఓ కారు బీభత్సం సృష్టించింది. జగద్గిరిగుట్ట ఔట్ పోస్ట్ ప్రయాణికులను గుద్ది ఆపకుండా వెళ్లిన కారు.. షాపూర్ లో మరికొంతమందిని ఢీకొట్టింది. వరుస రోడ్డు ప్రమాదాలు చేసి దూసుకుపోతున్న కారును పోలీసులు చాకచక్యంగా అడ్డుకున్నారు. డ్రంకన్ డ్రైవ్ చేయగా మద్యం మత్తులో ఉన్నాడని తేలింది. స్థానికులు ఆవేశంతో డ్రైవర్ ను చితకబాదారు. ఓ కారు జగద్గిరిగుట్ట వద్ద కొందర్ని ఢీకొట్టింది. కారు ఆపేందుకు చూడగా దూసుకెళ్లింది. ఛేజ్ చేసి రాళ్లతో కొట్టినా కారును అందుకోలేకపోయారు. కొందరు ప్రయాణికులకు గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. తరువాత షాపూర్ లోనూ మరికొన్ని వాహనాలను, ప్రజలను ఢీకొట్టి దూసుకెళ్తున్న కారు ఘటనపై జిడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్ఐ సందీప్ చాకచక్యంగా వ్యవహరించి కారును అడ్డుకున్నారు.ట్రాఫిక్ సిగ్నల్ నిలిపివేసి, కారును ఆపి నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. డ్రంకన్ డ్రైవ్ టెస్టులు చేయగా డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని తేలింది. ఆవేశానికి లోనైన ప్రయాణికులు ప్రమాదం చేసి పరారవుతున్న డ్రైవర్ ను చితకబాదారు. సూరారం పోలీసులు హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసి, కారు నడిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. హ్యుండయ్ అమేజ్ కారు తమిళనాడులో రిజిస్ట్రేషన్ అయింది. ప్రమాదానికి కారణమైన కారు టిఔ70 యా6815 అని పోలీసులు తెలిపారు.మద్యం మత్తులో వాహనాలు నడిపి డ్రంకన్ కేసుల్లో చిక్కుకుంటే సమస్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఒకరి మద్యం మత్తు వారి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టివేస్తుంది. మద్యం సేవించిన సమయంలో ప్రత్యామ్నాయ డ్రైవింగ్ మార్గాలు చూసుకోవాలని, లేకపోతే క్యాబ్ లాంటివి బుక్ చేసుకుని ప్రయాణాలు చేయడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చు అని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

# అమరావతిలో కీలక పరిణామం.. ప్రభుత్వం ఫుల్ ఫోకస్

విజయవాడ : అమరావతి రాజధాని నిర్మాణం పై ఏపీ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. పునర్నిర్మాణ పనులు శరవేగంగా ప్రారంభించాలని నిర్ణయించింది. అటు క్యాబినెట్ సబ్ కమిటీ సైతం కీలక సూచనలు చేసింది. కేంద్ర ప్రభుత్వం సైతం అమరావతి రాజధాని నిర్మాణానికి సాయం ప్రకటించింది. కీలక రవాణా, రైల్వే ప్రాజెక్టులను సైతం మంజూరు చేసింది. ప్రపంచం గుర్తించదగ్గ రాజధానుల్లో అమరావతిని చేర్చాలని చంద్రబాబు భావిస్తున్నారు. 2028 నాటికి అమరావతి రాజధాని నిర్మాణ పనులు పూర్తి చేయాలని చూస్తున్నారు. అయితే ఈ నెల 15న అమరావతి పరిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అన్ని ఏర్పాట్లు చేస్తోంది. వెంకటపాలెం లో గల శ్రీవారి ఆలయంలో కల్యాణోత్సవం జరగనుంది. సీఎం చంద్రబాబు తో పాటు పలువురు మంత్రులు హాజరు కానున్నారు.2014లో అధికారంలోకి వచ్చింది తెలుగుదేశం పార్టీ అమరావతిని రాజధానిగా ప్రకటించింది. 2018లో సీఎం చంద్రబాబు వెంకటపాలెంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి 25 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. 2019లో శంకుస్థాపన కూడా చేశారు. అటు తరువాత వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమరావతిని నిర్వీర్యం చేసింది. కానీ ఈ ఆలయ నిర్మాణాన్ని మాత్రం పూర్తి చేసింది. 2022లో వైభవంగా ప్రారంభించారు ఈ ఆలయాన్ని. ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. అధికారుల సమీక్ష వెంకటపాలెం శ్రీవారి ఆలయంలో.. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని టీటీడీ కార్యనిర్వాహణ అధికారి శ్యామలరావు సమీక్ష చేశారు. శ్రీవారి ఆలయ ప్రాంగణంలో ఈ సమావేశం జరిగింది. టిటిడి అదనపు ఈవో వెంకయ్య చౌదరి, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్ పాల్గొన్నారు. శ్రీనివాస కళ్యాణం పై అమరావతి గ్రామాల్లో టీటీడీ ప్రచార రథం పై పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. భక్తులు భారీగా తరలివచ్చి అవకాశం ఉండడంతో.. ఆలయ ప్రాంగణంలో గ్యాలరీలు, క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా పార్కింగ్ స్థలాలను గుర్తించామని.. పబ్లిక్ అడ్రస్ సిస్టం ద్వారా వాహనాలను ఎక్కడ నిలపాలనే విషయాన్ని భక్తులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తామని తెలిపారు. మొత్తానికైతే అమరావతిలో భారీ ఈవెంట్ కు ప్లాన్ చేసింది తిరుమల తిరుపతి దేవస్థానం.

# రేవంత్ సీరియస్ కు కారణం ఏమిటీ?



హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్‌లో నేతల తీరే వేరు. సీఎం రేవంత్ వ్యవహారం వేరు. ఆయన ఏం మాట్లాడినా దాని వెనుక ఏదో ఉంటుందని హస్తం పార్టీలోనే చర్చ ఉంటుంది. ఇప్పుడు సీఎల్పీ భేటీలో సీఎం చేసిన కామెంట్స్‌పై కూడా కాంగ్రెస్ పార్టీలో ఇలాంటి డిస్కషనే జరుగుతోందట. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌తో మీటింగ్‌లో ఉన్నవారంతా అవాక్కయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తుంటే పట్టనట్లుగా ఉండటం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారట. మరోవైపు ప్రతిపక్ష పార్టీతో సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకోవడమేంటంటూ నిలదీశారట. బీఆర్ఎస్ నేతలతో సన్నిహితంగా ఉంటే వచ్చే ఎన్నికల్లో మీపై పోటీ పెట్టరని భావిస్తున్నారా..? అంటూ గుస్సా అయ్యారట. ఆల్ ఆఫ్ సడన్‌గా సీఎం ఈ స్థాయిలో కామెంట్స్ చేసేసరికి.. సీఎల్పీ సమావేశంలో ఉన్న ఎమ్మెల్యేలు ఖంగుతిన్నారట. ఈ స్థాయిలో ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అవ్వడానికి రీజన్ ఏంటనే దానిపై గుసగుసలు వినిపిస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాల మొదటిరోజు మాజీ సీఎం కేసీఆర్ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సభలో ఉన్న కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వరావు స్వయంగా కేసీఆర్ దగ్గరకి వెళ్లి మరీ కుశల ప్రశ్నలు వేశారట. పనిలో పనిగా కేసీఆర్ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారట. అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ కూడా విడిగా కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారట. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తన తమ్ముడి కుమారుడి వివాహానికి రావాలని కేసీఆర్‌కు ఇన్విటేషన్ ఇచ్చారు. సభలో కేసీఆర్‌తో ఎమ్మెల్యేలు, మంత్రులు మర్యాదపూర్వకంగా మాట్లాడటం చూసిన సీఎం రేవంత్ రెడ్డి? కేసీఆర్‌తో మాట్లాడిన విషయాన్ని ప్రస్తావించకుండా ఇన్‌డైరెక్టుగా వరుస పెట్టి గుంపులో గోవిందం అన్నట్లుగా అందరికీ చురకలంటించారని ప్రచారం జరుగుతోంది. అంతేకాదు రవీంద్ర భారతిలో జాబ్ పట్టాల పంపిణీ కార్యక్రమంలో కేసీఆర్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలు కూడా ఆ ఫ్రస్టేషన్‌లో భాగమే నంటోంది బీఆర్ఎస్. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై కొందరు లోలోపల మాట్లాడుతుండగా మరికొందరు బహిరంగంగానే కామెంట్స్ చేస్తున్నారు. కొందరు నేతలు, ఎమ్మెల్యేలు అయితే కొంతకాలంగా బీఆర్ఎస్‌తో సన్నిహిత సంబంధాలు మెయింటెన్ చేస్తున్నారనే డౌట్ సీఎంకు ఉందట. హస్తం గూటికి చేరిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో కొందరు ఈ మధ్య రివర్స్ అవుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. అలాగే మాజీ ఎమ్మెల్యే కోనప్ప లాంటి వాళ్లు సైతం బహిరంగంగానే కాంగ్రెస్‌ను విమర్శిస్తూ కేసీఆర్‌ను పొగుడుతుండటం లాంటి పరిస్థితులు కూడా సీఎంకు చికాకు తెప్పిస్తున్నాయట. మరోవైపు బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను సైతం నేతలెవరూ సరిగ్గా తిప్పికొట్టకుండా ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరిస్తుండటం కూడా సీఎం రేవంత్‌కు చిరాకు తెప్పించిదంటున్నారు. ఇప్పుడు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు కేసీఆర్‌ను పలకరించడం కూడా ఆయనకు పుండు మీద కారం చల్లినట్లు అయిందట. ఇవన్నీ మనసులో పెట్టుకునే ఎవరి పేరు ప్రస్తావించకుండా ఎమ్మెల్యేలందరినీ లెఫ్ట్ అండ్ రైట్ తీసుకున్నారట రేవంత్. సీఎల్పీ మీటింగ్‌లో సీఎం చేసిన కామెంట్స్ వెనుక ఆంతర్యమేంటని కాంగ్రెస్ నేతలు ఆరా తీస్తుంటే.. కేసీఆర్ స్ట్రేచర్‌ను చూసి రేవంత్ ఫ్రస్టేట్ అవుతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. ఇలా పార్టీ ఎల్పీ మీటింగ్‌లో రేవంత్ చేసిన కామెంట్స్ అటు కాంగ్రెస్‌లో.. ఇటు అపోజిషన్ బీఆర్ఎస్‌తో పాటు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# కేజీబీవీ ప్రారంభమెప్పటికో..?

కొండమల్లేపల్లి : సొంత భవనం కోసం నాలుగేళ్లుగా నిరీక్షించారు. నిర్మాణం పూర్తయ్యిందన్న సంతోషం ఒక వైపు.. రేకుల షెడ్డులో తాము పడ్డ అవస్థలు తీరిపోతా యని అనుకున్న విద్యార్థినుల కల మాత్రం సాకా రం కావడం లేదు. ఏడాదిలో పూర్తి కావాల్సిన కొం డమల్లేపల్లి కేజీబీవీ భవనం నిర్మాణం పూర్తి చేసుకోవడానికి నాలుగేళ్ల కాలం పట్టగా.. నాలుగేళ్లకు నిర్మాణం పూర్తి చేసుకొని నాలుగు నెలలు గడుస్తు న్నా కొండమల్లేపల్లి కేజీబీవీ ఇంకా విద్యార్థినులకు అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థినులు తీవ్ర నిరాశలో ఉన్నారు.

**రేకుల షెడ్డులో విద్యాభ్యాసం**

మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో ఓ ప్రైవేటు రేకుల షెడ్డులో 6 నుంచి 10వ తరగతి వరకు కేజీబీవీని నిర్వహిస్తున్నారు. ఆ షెడ్డులో మౌ లిక వసతులు లేకపోవడంతో విద్యార్థినులు ఇ బ్బందుల నడుమ విద్యను కొనసాగిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఒక్కో తరగతికి 40 మంది చొప్పున దాదాపు 220 మందివిద్య నభ్యసిస్తుండగా అద్దె భవనం రేకుల షెడ్డు కావడంతో అరకొర వస తులతో విద్యార్థినులు ఇబ్బందులకు తదితర సమ స్యలతో ఇప్పటికే సుమారు 30 మంది వరకు విద్యార్థినులు టీసీలు తీసుకొని వేరే పాఠశాలలో చేరారు. దీనికి తోడు వేసవి కావడం రేకుల షెడ్డులో తీవ్రమైన ఉక్కబోతతో విద్యార్థినులు సతమత మవుతున్నారు. రేకుల షెడ్డులో కొనసాగుతున్న కేజీబీవీకి ఆకతాయిల చేష్టలు విసుగు తెప్పిస్తుండడంతో పాటు విద్యార్థినులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. గతేడాది అద్దె భవనంలోకి ఓ ఆకతాయి చొర బడడంతో విద్యార్థినులు తీవ్ర భయాందోళనతో కంగారుపడ్డారు. ఈ ఘటన నేపథ్యంలో పోలీసులు సైతం ఇక్కడ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ప్రహరీ సరిగా లేకపోవడంతోనే ఆకతాయిలు ఇక్కడ విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆకతాయిల చేష్టలతో విద్యార్థినుల తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను అద్దె భవనంలో ఉంచేందుకు జంకుతున్నారు.

**అధికారుల ఉదాసీనత**

సొంత భవనం ఏర్పాటుకు గత ప్రభుత్వం రూ. 3.35 కోట్లు మంజూరు చేయగా 2021లో అప్పటి మంత్రి జగదీశరెడ్డి, అప్పటి ఎమ్మెల్యే రమావత రవీంద్రకుమార్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొదటి రెండేళ్లు నిర్లక్ష్యంతో నిర్మాణం పూర్తి చేయడంలో జాప్యం జరగ్గా.. స్థానిక నాయకులు, విద్యార్థి సంఘాల ఒత్తిడితో గతేడాది డిసెంబర్ నాటికి ఎట్టకేలకు నిర్మాణం పూర్తి చేసుకుంది. నిర్మాణం పూర్తయి సుమారు నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇన్నాళ్లు సొంత భవనం లేక ఇబ్బందిపడిన విద్యా ర్థినులు భవన నిర్మాణం పూర్తయినప్పటికీ తమకు అందుబాటులోకి తీసుకురావడంలో జాప్యం జరు గుతోంది. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు అస హనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఉదా సీన తను విడి భవనాన్ని ప్రారంభించి విద్యార్థినుల కష్టాలను తొలగించాలని కోరుతున్నారు.

# కేఎల్ఐ కింద కొత్త ఆయకట్టు కలేనా ?

## - 13 ఏళ్లు గడుస్తున్నా పూర్తి స్థాయిలో నీరందని పరిస్థితి
## - సర్వే దశలోనే కొత్త రిజర్వాయర్లు - చివరి ఆయకట్టుకు నీరందక అన్నదాతల ఆవేదన



నాగర్‌కర్నూల్ : అనేక అభ్యంతరాలు, అడుగడుగునా అవాంతరాలు, నిధుల లేమి మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని (ఎంజీకేఎల్ఐ) నిర్వీర్యం చేస్తోంది. నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు వద్ద పథకం ప్రారంభమై దాదాపు 13 ఏళ్లు కావస్తున్నా చివరి ఆయ కట్టు వరకు సాగునీరందకపోగా కొత్త ఆయకట్టు స్థిరీక రణ జరగకపోవడం మెట్ట రైతులను నిరాశకు గురి చేస్తోంది. 1996లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో పథకానికి అంకురార్పణ జరి గింది. పరిమితమైన బడ్జెట్‌తో పనులు ప్రారంభమైనా ఆ తర్వాత ఊపందుకున్నాయి. రెండు లక్షల 40 వేల ఎకరాలకు సాగునీరందించాలనే సంకల్పంతో చేపట్టా రు. నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, జడ్చర్ల, అచ్చంపేట ప్రాంతాలకు సాగునీరు అందించాలని డిమాండ్ రావడంతో క్రమంగా ప్రాజెక్టు ప్రాధాన్యతలు మారుతూ వచ్చాయి. ఈ క్రమంలో 4.51 లక్షల ఎకరాలకు సాగునీరందించాలని లక్ష్యాన్ని నిర్దేశించగా ఆచరణలో మాత్రం అమలు కావడంలేదు.

**కొత్త ఆయకట్టు స్థిరీకరణ కలేనా ?**

కేఎల్ఐ కింద కొత్త ఆయకట్టును స్థిరీకరించి మెట్ట ప్రాంతాలకు సాగునీరందే అంశం ఈ ప్రాంత రైతుల కు కలగానే మిగిలిపోతుందా అనే సంశయం మొద లైంది. కల్వకుర్తి, అచ్చంపేట బ్రాంచ్ కెనాళ్ల ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరందకపోగా కేవలం 540 చెరువులు, కుంటలను నింపి వాటి ద్వారానే ఆయకట్టుకు నీరందిస్తున్నారు.

**ఆ 45 రిజర్వాయర్ల సంగతేంటి?..** 4లక్షల 51 వేల ఎకరాలకు సాగునీరందించాలని రూపొందించిన ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టుకు కనీసం 45 టీఎంసీల నీరు అవసరమవుతుంది. కేవలం కృష్ణానది వరద జలాలపై ఆధారపడిన ఈ ప్రాజెక్టుకు నీటిని తోడుకునే సమయంలో నిల్వ చేసుకునే రిజర్వాయర్ల సామర్థ్యం లేదు. నార్లాపూర్, సింగవట్నం, జొన్నల బొగుడ, గుడిపల్లి గట్టు రిజర్వాయర్లలో 3 టీఎంసీల లోపు నీటిని మాత్రమే నిల్వ చేసుకునే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో కేఎల్ఐకి 17 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే విధంగా ప్యాకేజీ నెంబరు 28లో మూడు, 29లో 28, 30లో 14 రిజర్వాయర్లు నిర్మించాలని వ్యాప్‌కో సంస్థ పదేండ్ల క్రితం చేసిన సర్వే కార్య రూపం దాల్చలేదు. ఇందుకు సంబంధించిన భూసేకర ణ అంశం కూడా కొలిక్కి రాకపోవడంతో మిగతా రైతుల్లో ఆందోళన నెలకొన్నది.

# బై బ్యాక్ స్కీం పేరుతో భారీ మోసం

హైదరాబాద్ : హైదరాబాద్‌లో మోసాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. అమాయకులే లక్ష్యంగా మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలంటూ బురిడీ కొట్టిస్తున్నారు. స్టాక్ మార్కెట్లు, బంగారం, ప్లాట్లపై పెట్టుబడి అంటూ అందిన కాడికి దోచేస్తున్నారు. లక్షలు, కోట్లు సేకరిస్తూ భారీ మొత్తంలో డబ్బులు చేతికొచ్చిన వెంటనే ఉడాయిస్తున్నారు. తాజాగా అలాంటి ఘటనే ఒకటి మహానగరంలో మరొకటి చోటు చేసుకుంది. బై బ్యాక్ స్కీమ్ పేరిట వీ ఓన్ ఇన్‌ఫ్రా సంస్థ 12 కోట్లకు టోకరా పెట్టింది. వీ వోన్‌న్రా గ్రూప్‌ను కూకట్‌పల్లి కేంద్రంగా ప్రారంభించిన సురేశ్, వెంకటేశ్, వంశీకృష్ణ.. అమాయకులను నట్టేట ముంచేశారు. ఓపెన్ ప్లాట్లు, బంగారంపై పెట్టుబడులు పెడితే బై బ్యాక్ పాలసీ కింద.. ప్రతి నెలా రిటర్న్ ఇస్తామని, అలాగే 25 నెలల్లో రెట్టింపు లాభాలు ఇస్తామని నమ్మబలికారు. ఏజెంట్లను నియమించుకుని 90 మంది నుంచి ఏకంగా 12 కోట్లు వసూలు చేశారు. అయితే 2 స్కీముల్లో పెట్టుబడి పెటిన వారంతా లాభాల కోసం ఎంత ఎదురు చూసినా నగదు మాత్రం చెల్లించలేదు నిర్వాహకులు. రోజులు, నెలలు గడుస్తున్నా డబ్బులు మాత్రం తిరిగి రావడం లేదు. సంస్థ కార్యాలయానికి వెళ్లినా పొంతన లేని సమాధానాలు ఎదురవుతున్నాయి. మోసపోయామని గ్రహించిన 25 మంది బాధితులు సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ నగదు ఎలాగైనా తిరిగి ఇప్పించాలని కోరారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు వెంకటేశ్, వంశీకృష్ణను అరెస్టు చేయగా.. ప్రధాన నిందితుడు, కీలక సూత్రధారి సురేశ్ మాత్రం పరారీలో ఉన్నాడు. అతని కోసం తీవ్రంగా గాలిస్తున్నామని, బాధితులకు ఎలాగైనా న్యాయం చేస్తామని ఈవోడబ్ల్యూ పోలీసులు చెబుతున్నారు. ఇక ఇటీవల ఈ-బైక్స్ దందా స్కామ్ బయటపడిన సంగతి తెలిసిందే.. పైకి.. ప్రశాంతంగా కనిపించినా.. లోపల నడిచే దందా వేరే ఉంది. వేలు కట్టండి.. కోట్లు సంపాదించండని ఆశ పెట్టి.. ఫుల్లుగా క్యాష్ చేసుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా విస్తరిస్తున్న ఈ స్కామ్ స్కీమ్.. వేలాది మంది నుంచి డబ్బులు వసూలు చేస్తోంది. ఎలక్ట్రిక్ బైకులని ముందుపెట్టి.. మల్టీ లెవెల్ మార్కెటింగ్ దందాని జోరుగా నడిపిస్తున్నారు. ముందు మీరు 15 వేలు కట్టండి.. మరో ఇద్దరితో చెరో 15 వేలు కట్టించండి. మీకు పది వేలు కమిషన్ వస్తుందని చెబుతున్నారు. అలా.. ఈ బిజినెస్‌లో దిగి కోట్లు సంపాదించామని కూడా చెప్పుకునే వాళ్లున్నారు. ఇది.. ఇలా ఉంటుంది ఈ దందా. పేరుకే.. ఎలక్ట్రిక్ బైకుల బిజినెస్. తెరవెనుక దందా జరిగే దందా వేరే. బైక్ షోరూంలు పెట్టి.. అసలు బైకే కొనాల్సిన అవసరం లేదని వాళ్లే చెబుతారు. ఒకవేళ మీకు బైక్ కావాలంటే.. మిగతా డబ్బులు చెల్లించి బైక్ కూడా తీసుకోవచ్చు. లేదంటే.. వాళ్లిచ్చే ఐడీతో.. వ్యాపారంలోకి దిగొచ్చు.

గతంలో.. ఈ తరహా మోసాలు, స్కీమ్‌లు, స్కామ్‌లు చాలానే జరిగాయి. కొన్ని వందల కోట్లు వసూలయ్యే దాకా బాగానే నడిపిస్తారు. ఓ స్టేజ్ దాటాక.. కింది లెవెల్‌లో లక్షల మంది ఉంటారు. అలా.. వారి కింద జాయిన్ అయ్యేందుకు ఎవరూ ఉండరు. ఆ టైమ్‌కి కంపెనీ పెట్టినోళ్లు జంప్ అయిపోతారు. ఆఖరికి వచ్చేసరికి.. కింది స్థాయిలో ఉన్నోళ్లకి.. డబ్బులు రాక, జాయిన్ అయ్యేందుకు ఎవరూ లేక.. వేలాది మంది కోట్లాది రూపాయలు లాస్ అవుతారు. అప్పుడు.. కొత్తగా డబ్బులు కట్టి జాయిన్ అయినవాళ్లు.. ఎవరిని నిలదీస్తారు? కంపెనీనా? వాళ్లని ఆ స్కీమ్‌లో చేర్పించిన వారినా? ఇప్పటికిప్పుడు.. ంఆటూ కంపెనీ బోర్డు తిప్పేస్తే పరిస్థితేంటి? లీగల్‌గానూ ఏమీ చేయలేని పరిస్థితి వస్తే దిక్కెవరు? నష్టపోయిన వాళ్లకు డబ్బును చెల్లించేదెవరు? మొదట్లో కోట్లు సంపాదించుకున్నామని చెప్పిన వాళ్లంతా.. కింది స్థాయిలో ఉన్నోళ్లకి డబ్బులు తిరిగి ఇస్తారా? ఇలా.. అనేక ప్రశ్నలు, సందేహాలున్నాయి.

# పడిపోతున్న పులులు, సింహాలు



గాంధీనగర్ : క్రమంగా తగ్గిపోతున్న పులుల సంతతి పరిరక్షణలో గుజరాత్ లోని గిర్ అభయారణ్యం ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ఆసియాటిక్ సింహాల సంరక్షణకు అనేక జాగ్రత్తలు తీసుకుంటారు. అయితే.. రాష్ట్రంలోని పులులు పెద్ద ఎత్తున మృత్యువాత పడుతున్నాయని అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024 చివరికి గత రెండేళ్లలో రాష్ట్రంలో 286 సింహాలు చనిపోయాయని గుజరాత్ ప్రభుత్వం అసెంబ్లీలో అంగీకరించింది. వాటిలో 228 సహజ కారణాల వల్ల మరణించగా, 58 అసహజ మరణాలు సంభవించాయని తెలిపింది. ఈ సంక్షోభం చిరుతపులి సంతతికి కూడా విస్తరించినట్లు గణాంకాలతో సహా వెల్లడించింది. చిరుతల్లో గత రెండేళ్ల కాలంలో 456 మరణాలు సంభవించినట్లు గుర్తించిన అధికారులు.. వాటిలో 303 సహజ కారణాల వల్ల, 153 అసహజ కారకాలతో ప్రాణాలు కోల్పోయాయని ప్రకటించిందిగిర్ అభయారణ్యం ద్వారా అనేక జాగ్రత్తలు తీసుకుంటున్న గుజరాత్ రాష్ట్రంలోని ఏటికేటా.. సింహాలు, పులుల్లో అసజహ మరణాల సంఖ్య పెరుగుతుండడం కలవరపెడుతోంది. ఇదే విషయమై ప్రతిపక్ష ఎమ్మెల్యే శైలేష్ పర్మార్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఈ గణాంకాలను రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి వివరణ ఇచ్చారు. రెండేళ్ల క్రితం అంటే 2023లో మొత్తంగా 121 సింహాల చనిపోగా, 2024 నాటికి ఆ సంఖ్య 165కు పెరిగిందని అధికారులు తెలిపారు. ఈ మరణాల్లో పెద్ద సింహాలతో పాటు వాటి పిల్లల్లోనూ మరణాలు కనిపిస్తున్నాయని తెలిసింది. గుజరాత్ అధికారుల నివేదిక ప్రకారం.. 2023 నాటి మరణాల్లో.. మొత్తం 58 పెద్ద సింహాలు చనిపోగా, మరో 63 సింహపు పిల్లలు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. ఇక.. 2024 నాటికి ఈ సంఖ్య 85 సింహాలకు పెరగగా.. మరో 80 సింహపు పిల్లలు మృత్యువాత పడ్డాయని తెలిపింది. సింహాల మరణాల్లో సహజ మరణాలు, అసహజ మరణాలుగా వర్గీకరించిన అధికారులు.. సహజ కారణాల వల్ల 102 పెద్ద సింహాలు, 126 పిల్లలు మరణించినట్లు తెలిపారు. అదే సమయంలో అసహజ రీతిలో చనిపోయినట్లుగా గుర్తించిన సింహాల్లో 41 పెద్ద సింహాలు, 17 సింహపు పిల్లలు ఉన్నాయని, ఇవ్వన్నీ అసహజ రీతుల్లో మృత్యువాత పడడవేం ఆందోళన కలిగిస్తోందని అంటున్నారు. మొత్తంగా భారత్లో తరిగిపోతున్న సింహాలు, పులల సంరక్షణకు ఎన్నో చర్యలు తీసుకుంటున్నా.. మరోవైపు అంతే స్థాయిలో సంక్షోభం ఇబ్బంది పెడుతోందని అంటున్నారు. ఈ గణాంకాలు గుజరాత్ రాష్ట్రంలో పెరుగుతున్న సంక్షోభానికి ఉదాహరణలు అని చెబుతున్నారు. గుజరాత్ సింహాల సంఖ్య పరిరక్షణ, ఆవాసాల ముప్పుల గురించి ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని అంటున్నారు. సింహాల మరణాల విషయమై ఆందోళనలు కలిగించే విషయాల్ని వెల్లడించిన తర్వాత.. గుజరాత్ ప్రభుత్వం శాసనసభలో చిరుతపులి మరణాలపై ఆందోళనకరమైన గణాంకాలను వెల్లడించింది. 2023లో 225 చిరుతపులుల మరణాలను ప్రభుత్వం నివేదించింది. ఆ మరుసటి ఏడాది 2024లో మరణాల సంఖ్య స్వల్పంగా పెరిగి 231కి చేరుకున్నట్లు తెలిపింది. రాష్ట్రంలోని చిరుతు పులలో 2023లో 154 పెద్ద చిరుతపులులు, 71 పిల్లలు మరణించినట్లు అధికారులు గుర్తించారు. అలాగే.. 2024లో 162 చిరుతపులులు, 69 పిల్లలు చనిపోయినట్లుగా రికార్డులు వెల్లడిస్తున్నాయి. వీటిలో సహజ కారణాల వల్ల 201 పెద్ద చిరుత పులులు, 102 పిల్లలు మరణించినట్లుగా గుర్తించారు. మొత్తం 303 మరణాలు సంభవించాగా.. వాటిలో 115 చిరుత పులులు, 38 చిన్న కూనలు అసహజ రీతుల్లో చనిపోయినట్లుగా తెలిపారు.

# 7 నెలల కనిష్ట స్థాయికి రిటైల్ ఇన్‌ఫ్లేషన్

ముంబై : హోలీ, ఉగాది, రంజాన్ పండుగల సమయంలో దేశ ప్రజలకు పెద్ద శుభవార్త. గత నెల (2025 ఫిబ్రవరి)లో, భారతదేశ రిటైల్ ఇన్‌ఫ్లేషన్ రేటు 7 నెలల కనిష్ట స్థాయికి చేరుకుంది. వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా లెక్కించే చిల్లర ద్రవ్యోల్బణం రేటు ఫిబ్రవరిలో 3.61 శాతంగా నమోదైంది. ఇది జనవరి కంటే 0.65 శాతం తక్కువ. గత ఏడాది జులైలో నమోదైన 3.54 శాతం తర్వాత, ఈ ఏడాది ఫిబ్రవరిలో నమోదైన సంఖ్యే అత్యల్పం. దేశంలో ద్రవ్యోల్బణం ఏడు నెలల కనిష్ట స్థాయికి దిగి రావడానికి ప్రధాన కారణం ఆహార ధరలు తగ్గడం. నెల క్రితం, 2025 జనవరిలో రిటైల్ ఇన్‌ఫ్లేషన్ 4.26 శాతంగా ఉండగా; ఏడాది క్రితం, 2024 ఫిబ్రవరిలో ఇది 5.09 శాతంగా ఉంది.

ఆహార ద్రవ్యోల్బణం తగ్గుదల

2025 ఫిబ్రవరిలో ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 3.75 శాతానికి తగ్గింది. ఈ ఏడాది జనవరిలోని 5.53 శాతంతో పోలిస్తే ఇప్పుడు ఏకంగా 222 బేసిస్ పాయింట్లు తగ్గడం విశేషం. 2023 మే నెల తర్వాత, మళ్లీ 2025 ఫిబ్రవరిలో ఇది అత్యల్ప స్థాయికి చేరుకుంది. ఫిబ్రవరిలో కూరగాయలు, గుడ్లు, మాంసం, చేపలు, పప్పుధాన్యాలు, పాలు, పాల ఉత్పత్తుల ధరలు తగ్గడం ఈ తగ్గుదలలో ముఖ్యమైన పాత్ర పోషించింది. 2024 ఫిబ్రవరితో పోలిస్తే 2025 ఫిబ్రవరిలో అత్యధికంగా తగ్గిన ఆహార ఉత్పత్తులు - అల్లం (-35.81%), జీలకర్ర (-28.77%), టమోటా (-28.51%), కాలీఫ్లవర్ (-21.19%), వెల్లుల్లి (-20.32%). గత ఏడాదితో పోలిస్తే, ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంధన ధరల్లోనూ ఉపశమనం లభించింది, ఇంటి బడ్జెట్లపై ఒత్తిడి తగ్గింది. ఇంధన ద్రవ్యోల్బణం రేటు 1.33 శాతం తగ్గింది. 2024 ఫిబ్రవరితో పోలిస్తే 2025 ఫిబ్రవరిలో కొన్ని ధరలు పెరిగాయి. అవి - కొబ్బరి నూనె (+54.48%), కొబ్బరి (+41.61%), ఉల్లిపాయలు (+30.42%), పసిడి (35.56%), వెండి (+30.89%).

ప్రాంతాల వారీగా ద్రవ్యోల్బణం గణాంకాలు

పట్టణ ప్రాంత ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 3.32 శాతానికి దిగి వచ్చింది, ఇది జనవరిలో 3.87 శాతంగా ఉంది.

ఫిబ్రవరిలో, గ్రామీణ ప్రాంత ద్రవ్యోల్బణం 3.79 శాతానికి పరిమితమైంది, జనవరిలో ఇది 4.59 శాతంగా నమోదైంది.

రాష్ట్రాల వారీగా చూస్తే - ఫిబ్రవరిలో, కేరళలో అత్యధికంగా 7.31 శాతంగా ఉంటే, తెలంగాణలో అత్యల్పంగా 1.31 శాతంగా నమోదైంది.

ఆర్‌బీఐకి కూడా ఇది శుభవార్తే

రిటైల్ ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గుతూ ఆర్‌బీఐ లక్ష్యమైన 4 శాతం కంటే తక్కువగా నమోదు కావడం ఉండటంతో కేంద్ర బ్యాంక్‌పై ఒత్తిడి తగ్గినట్లైంది. ఆర్థిక వృద్ధిని పరుగులు పెట్టించడానికి ఁ ఉపాధిని పెంచడానికి వడ్డీ రేట్లను మరింత తగ్గించే నిర్ణయం తీసుకోవడానికి ఖీఃఎకి స్వేచ్ఛ దొరికింది. గత నెలలో జరిగిన ద్రవ్య విధాన సమీక్షలో, ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పాలసీ రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించారు. దీంతో, రెపో రేటు 6.25 శాతానికి దిగి వచ్చింది. ద్రవ్యోల్బణాన్ని గమనిస్తూనే వృద్ధికి మద్దతు ఇచ్చే 'తటస్థ వైఖరి'ని కొనసాగించాలని ఆ భేటీలో ఓఖఅ నిర్ణయించింది. దీని అర్థం ద్రవ్యోల్బణం రేటు మరింత తగ్గితే, పాలసీ రేట్లను ఆర్‌బీఐ మరింత తగ్గించగలదు, ఇది ఆర్థిక వ్యవస్థలో వేగం పెంచుతుంది. ద్రవ్యోల్బణం రేటు తగ్గడం సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగించడమే కాకుండా, పెట్టుబడి ఁ వినియోగదారుల వ్యయం పెరగడానికి కూడా దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇది ఆర్థిక వ్యవస్థకు సానుకూల సంకేతం.

# రేషన్ నో స్టాక్..

మంచిర్యాల : లబ్ధిదారు లకు రేషన్ సరుకులు పంపణీ చేసే చౌక ధరల దు కాణాలు స్టాక్ లేక వెలవెలబోతున్నాయి. ప్రతి నెల ఒకటి నుంచి 15వ తేదీలోపు రేషన్ షాపుల్లో బియ్యం పోయాల్సి ఉంది. అయితే ఇంకా దాదాపు 40శాతం మేరక స్టాక్ చేరుకో కపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో మొత్తం ఐదు ఎంఎల్ఎస్(మండల్ లెవెల్ స్టాకిస్ట్ పాయింట్) గోదాముల ద్వారా 424 చౌక ధరల దుకాణాలకు బియ్యం సరఫరా కావాల్సి ఉంది.

**ఖాళీగా దర్శనమిస్తున్న ఎంఎల్ఎస్ పాయింట్లు...**

చౌక ధరల దుకాణాలకు రేషన్ బియ్యం సరఫరా చేసే ఎంఎల్ఎస్ పాయింట్లు సరిపడా స్టాక్ లేక ఖా ళీగా దర్శనమిస్తున్నాయి. లబ్ధిదారుల అవసరాలకు సరిపడా బియ్యం మరుసటి నెలకు సంబంధించి న డుస్తున్న నెలలో 25వ తేదీలోపు అందుబాటులో ఉం చాలి. స్టాక్ వివరాల సరి చూసుకొని డీలర్లు ఒకట వ తేదీ నుంచి బియ్యం పంపిణీ చేస్తారు. మార్చి నె లకు సంబంధించి మరో మూడు రోజులే గడువు ముగిసి ఉన్నా... ఇప్పటి దాక ఎంఎల్ఎస్ పాయిం ట్లకు బియ్యం సంబంధిత కాంట్రాక్టర్ల నుంచి చేరక పోవడం గమనార్హం. ఎప్పటికప్పుడు బియ్యం నిల్వలను సరి చూసుకొని అవసరం మేరకు తెప్పిం చాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల గోదాములు ఖాళీగా కనిపిస్తున్నాయి.

**సగ భాగం కొరత...**

జిల్లాలోని 424 షాపులకు లబ్ధిదారుల సంఖ్యను బట్టి సగటున ప్రతి నెల 70 క్వింటాళ్ల మేర బియ్యం అవసరం అవుతాయి. అలా జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా రేషన్ షాపులకు సరఫరా చేయ డానికి సుమారు 7 మెట్రిక్ టన్నుల సరుకు సరఫరా జరుగాలి. అయితే ఇప్పటి వరకు అందులో కేవలం సగ భాగం మాత్రమే షాపులకు చేరినట్టు తెలుస్తోం ది. మిగితా స్టాక్ కోసం డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద పడిగాపులు కాసిన ఫలితం ఉండడం లేదు. దీనితో లబ్ధిదారులకు జవాబు చెప్పలేక షాపులను మూసి ఉంచాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. స్టాక్ వచ్చినప్పుడల్ల తెరిచి అనంతరం మూసి ఉంచక త ప్పని పరిస్థితులు నెలకొన్నాయని స్వయంగా డీలర్లే చెబుతుండడం గమనార్హం.

**తరుచుగా ఇదే తంతు...**

గత కొంతకాలంగా రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు సకాలంలో బియ్యం అందని దాఖలాలు ఉ న్నాయి. కొన్ని సార్లు ఎంఎల్ఎస్ పాయింట్లలో స్టాకు ఉన్న స్టేజ్-1, స్టేజ్-2 కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల బి య్యం పంపిణీ కావడం లేదు. సరైన సమయంలో లారీలు అందుబాటులో ఉంచకపోవడంతో ఈ పరిస్థి తులు నెలకొంటున్నాయి. ఇదిలా ఉండగా మరికొన్ని సార్లు అసలు స్టేషన్-1 కాంట్రాక్టర్ వద్దకే పౌర సర ఫరాల శాఖ నుంచి పంపిణీ జరుగడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇలా ప్రతి నెల ఏదో తంతు చూపి లబ్ధిదారులను.. షాపుల చుట్టూ తిప్పుకోవడం ఆనవాయితీగా మారింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా బియ్యం ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలి యని పరిస్థితులు నెలకొనగా, షాపుల చుట్టూ తిర గాల్సిన దుస్థితి లబ్ధిదారులకు పట్టింది.

రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ ఈ నెల 15తో గడువు ముగియనుండగా అధికారులు స్పందించి గ డువు పెంచాల్సిన అవసరం ఉంది. పౌరసరఫరాల శాఖ నిర్లక్ష్యం కారణంగా రేషన్ షాపులు ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యం నిల్వ లేక వెలవెలబోతున్నా యి. అధికారుల తప్పిదానికి లబ్ధిదారులను ఇబ్బందు లు పెట్టకుండా సరిపడా స్టాక్ వచ్చి పంపిణీ పూర్తయ్యే వరకు గడువు పెంచాలనే డిమాండ్లు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




## శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్ దంపతులు

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

తిరుమల తిరుపతి దేవస్థానంలోని కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి. శ్రీవారి ఆశీస్సులతో మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలందరు ఆయురారోగ్యాలతో, రైతులు పాడి పంటలతో,సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారికి తల నీలాలు అర్పించడం జరిగిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన కీర్తి రెడ్డి

**వేద న్యూస్, శాయంపేట :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గోరుకొత్తపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో వసంత చంద్రమౌళి కుమారుడు ప్రశాంత్-రితిక వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి. జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషిధర్ రెడ్డి వారి వెంట నాయకులు మండల అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, విష్ణు యాదవ్, బొట్ల సుమన్,కిషన్, రాజేందర్, రంజిత్, ప్రభాకర్, రాంబాబు,రాము, వేణు, రమేష్,మహేందర్, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.




## వృద్ధ మహిళకు చెక్క బల్ల పంపిణీ

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

వరంగల్ రామన్నపేటలోని డాక్టర్. ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధ మహిళ రాజ్యలక్ష్మి కి మానవతా దృక్పథంతో చెక్క బల్ల పంపిణీ చేయడం జరిగినది. వృద్ధురాలు క్రింద పడుకోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ రాజేంద్రప్రసాద్ సోమవారం అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా వృద్ధ మహిళ రాజేంద్రప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ స్థానిక మహిళలు ఎల్లమ్మ, మల్లమ్మ, కుసుమ కుమారి మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## చరిత్రను గుర్తుచేసేది ఫోటో

**వేద న్యూస్, హైదరాబాద్ :**

చరిత్రను గుర్తు చేసేది ఒక ఫోటో మాత్రమే అని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. సోమవారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో 185 వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో ఆయన రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాలగర్భంలో కలిసిన చరిత్రను సజీవంగా నిలిపేది ఫోటో మాత్రమేన్నారు. ఎన్నో విలువైన తీపి జ్ఞాపకాలను ఎప్పటికీ గుర్తుండిపోయేది ఒక ఫోటో మాత్రమే అని చెప్పారు. ప్రతి క్షణాన్ని ఒక మధుర జ్ఞాపకంగా చూపించగలిగేది ఫోటో అన్నారు. చరిత్రలతో పాటుగా మనం పోయిన...బ్రతికే ఉంచేది ఫోటో మాత్రమే అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తుడి దేవేందర్ రెడ్డి, దేవులపల్లి అమర్, అలి,హర్ జాన్, గంగాధర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆర్ధిక స్థితి యువత భుజస్కంధాలపైనే ఉంది

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**




రాష్ట్రం ఆర్థికంగా ముందడుగు వేయాలంటే యువత తమ బాధ్యతను గుర్తెరిగి నడుచుకోవాలని,రాష్ట్ర ఆర్థిక భవిష్యత్ నిర్ణేతలు వారేనని ప్రొఫెసర్ ఇ.పురుషోత్తం పేర్కొన్నారు.కె.ఎన్.ఎం.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధానాచార్యులు డా.ఎస్.ఉపేందర్ అధ్యక్షతన ఐ.సి.ఎస్.ఎస్.ఆర్ ఆధ్వర్యంలో అర్థశాస్త్ర విభాగం మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్న గ్రోత్ పొటెన్షియాలిటీస్ ఇన్ తెలంగాణ స్టేట్-ప్రొస్పెక్ట్స్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై జరుగుతున్న రెండురోజుల జాతీయ సదస్సులో భాగంగా మొదటి రోజు కార్యక్రమంలో ముఖ్యవక్తగా పాల్గొన్న ఆయన సదస్సునుద్దేశించి మాట్లాడారు. నూతన అభివృద్ధి విధానాలు, అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలు, మరియు ఆర్థిక సంక్షోభాల పరిష్కారాలపై ప్రసంగించారు. తెలంగాణా ఎకనామిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రొ.ముత్యంరెడ్డి ఆర్థిక విధానాలలో సోషలిజం మరియు మార్కెట్ ఎకానమీ మధ్య వ్యత్యాసం, వాటి ప్రయోజనాలు,మౌలిక భేదాలు, మరియు సామాజిక సామాన్య అభివృద్ధిగురించి తెలియజేసారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణా ధనిక రాష్ట్రమే కాని, ప్రజలు బీదలుగా మారడానికి కారణాలను విశ్లేసించుకోవాలని, నేటి తెలంగాణా యువత ప్రతీ విషయంలో అనాసక్తతను కనబరిచి,నిర్వీర్య స్థితిలోకి వెళ్తోందని,వారి అసమర్థత రాష్ట్ర ఆర్థిక స్థితిని దిగజారుస్తోందని,యువత ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొని రాష్ట్ర ఆదాయ మార్గాన్ని పెంచేవిధంగా ఆలోచించాలని సూచించారు.రాష్ట బడ్జెట్ లో విద్యారంగానికి మరిన్ని నిధులు కేటాయించాలని తెలంగాణా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఎ.పున్నయ్య పేర్కొన్నారు. సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ విజిటింగ్ ప్రొఫెసర్ ఇంద్రకాంత్ మాట్లాడుతూ ఆర్థిక నిర్వహణ,ఆర్థిక సంస్కరణలు, ఆర్థిక ప్రగతి తర్కానికి లోబడి ఉంటుందని పేర్కొన్నారు.నూతన ఆర్థిక వ్యూహాలు,వాటి ప్రభావం,ప్రజల జీవన ప్రమాణాలపై ఆర్థిక విధానాల విశ్లేషణ,కొత్త వ్యూహాల అవసరం,ఆర్థిక విధానాలు సాధికారత వృద్ధిలో ఎలా బలపడుతాయనే విషయాలపై ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఎస్.రాములు ప్రసంగించారు.ఈ సదస్సులో దేశంలోని ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్తలు,విద్యావేత్తలు మరియు పరిశోధకులు పాల్గొని తమ పరిశోధనలతో పాటు ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి, వినియోగం, మౌలిక సదుపాయాలు మరియు మానవ వనరులకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రసంగించారు.

ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యం ఆర్థిక సమతుల్యత, వ్యవస్థల మెరుగుదల,ఆర్థిక వృద్ధి,ప్రపంచ మార్కెట్ల ప్రభావం, మార్కెట్ దిశలు అని కార్యక్రమ నిర్వాహకులు డా.నరేష్ పేర్కొన్నారు. ఈ సదస్సులో పలువురు అధ్యాపకులు,కళాశాల అధ్యాపకేతర సిబ్బంది,వివిధ కళాశాలల విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

# మాదిగలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్..!

**మాజీ కార్పొరేటర్ దాస్యం విజయభాస్కర్**

**వేద న్యూస్, హన్మకొండ :**



ఎమ్మార్పీఎస్ దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు మాజీ కార్పొరేటర్ తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు దాస్యం విజయభాస్కర్ తెలిపారు. సోమవారం ఏకాశిల పార్క్ వద్ద ఎమ్మార్పీఎస్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షలు తొమ్మిదవ రోజుకు చేరింది. ఈ దీక్షకు సంఘీభావం తెలిపిన మాజీ కార్పొరేటర్ దాస్యం విజయభాస్కర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి కేవలం మాదిగలనే కాకుండా అన్ని వర్గాలను మోసం చేస్తున్నాడని మాయమాటలు చెప్పి పబ్బం గడుపుతున్నాడని ఎద్దేవా చేశారు. ఎస్సీల వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగలు చేస్తున్న పోరాటాన్ని గుర్తించి ఇది న్యాయమైన డిమాండ్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ మొదటి సంవత్సరంలోనే తెలంగాణ అసెంబ్లీలో ఎస్సీల వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని మరియు ఎస్సీల వర్గీకరణ కోసం కేసీఆర్ అనేకసార్లు ప్రధానమంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. ఎస్సీల వర్గీకరణకు అనుకూలంగా చేవెళ్లలో డిక్లరేషన్ చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు కమిషన్ల పేరుతో మాదిగలను మోసం చేస్తూ మాదిగలను నమ్మించి గొంతుకోస్తుందని అన్నారు. వర్గీకరణ చేస్తానని అసెంబ్లీ సాక్షిగా మాట ఇచ్చిన రేవంత్ రెడ్డి వర్గీకరణ అమలు కాకముందుకే ఉద్యోగ నియామకాలు చేస్తూ మాదిగలకు రావలసిన ఉద్యోగాలను రాకుండా చేస్తున్న విషయాన్ని ప్రతి మాదిగ బిడ్డ గమనించాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో ఎస్సీల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా మాదిగలను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగలు ఎలాంటి పోరాటం చేసిన బిఆర్ఎస్ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఉంటుందని అవసరమైతే ప్రత్యక్షంగా మాదిగల కోసం పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జాతీయ నేతలు మంద కుమార్ మాదిగ,వేల్పుల సూరన్న కాపు,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్ను దినేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా ఇన్చార్జి మంద రాజు మాదిగ,మాదిగ యువసేన జాతీయ నాయకులు పుట్ట బిక్షపతి మాదిగ, చాతల్ల శివ మాదిగ, ఎమ్మార్పీఎస్ సోషల్ మీడియా ఇంచార్జ్ మంద వర్ధన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు అడ్డూరి అనిల్ మాదిగ, బొంకురి సాంబయ్య మాదిగ, అడ్డూరి రమేష్ మాదిగ, బొంకూరి ఐలయ్య మాదిగ, చిలుముల రవి మాదిగ, సుంచు అశోక్ మాదిగ, అడ్డూరి బాబు మాదిగ, బొంకురి రాధ మాదిగ, బొంకూరి రజిత మాదిగ, చిలుముల లావణ్య మాదిగ, చిలుముల సుశీల మాదిగ తదితరులు పాల్గొన్నారు.



## నవ దంపతులకు ఉపాధ్యాయుల ఆశీర్వాదం..

**వేద న్యూస్, నల్లబెల్లి :**



నల్లబెల్లి మండలంలోని కొండాపూర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడి మాలోత్ వెంకటేశ్వర్లు వివాహ రిసెప్షన్ కు పీఆర్‌టీయూటీఎస్ జిల్లా నాయకులు హాజరై ఆశీర్వదించారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్ రెడ్డి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నకిరెడ్డి మహేందర్, ఉడుత రాజేందర్ ఉపాధ్యా యులతో కలిసి గిఫ్ట్ అందజేసి నవ దంపతులకు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఏ.కృష్ణ మూర్తి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సతీష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి ముత్తోజు బిక్షపతి, జిల్లా ఉపాధ్యక్షులు కందకట్ల నాగరాజు, జిల్లాకా ర్యదర్శి శనిగరం శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు లక్కార్స్ ఈశ్వర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పురం బద్రీనాథ్, కె.వెంకట్ రామ్ నరసయ్య, మండల అసోసియేట్ అధ్యక్షు డు భానోత్ కృష్ణ, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం బ్రహ్మచారి, కొండాపూర్ హెడ్మాస్టర్ శ్రీనివాస్ రాజు, గుండ్లపాడు ప్రధానోపాధ్యాయురాలు ఉషశ్రీ, నారక్కపేట ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్ జి.సదా నందం, ఉపాధ్యాయులు రాజగో పాల్ రెడ్డి, కుమారస్వామి, ప్రవీణ్ కుమార్, కునమల్ల రాజన్ బాబు, రాజేందర్, రవి, అనూష, ఉల్లిరావుల అనిత, కాసం మనోజా రెడ్డి, భాగ్యశ్రీ, యుగేందర్, సిఆర్‌పిలు రవి, రాజేందర్, వెంకటయ్య, ఉపాధ్యాయులు కీర్యా, మోహన్ లాల్, తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించాల్సిన మధ్యాహ్నం భోజనం సరైన మెనూ ప్రకారం అందించట్లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కమలాపూర్ మండల అధ్యక్షులు కత్తి రమేష్ కమలాపూర్ మండల విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి కమలాపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడా కూడా పూర్తిస్థాయిలో మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించట్లేదన్నారు. వారంలో ఏ రోజు ఏ వెరైటీ తో కూడిన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందిస్తున్నారో ఆ భోజనం మెనూ నీ డిస్ప్లే బోర్డులో పెట్టి దాని ప్రకారం విద్యార్థులకు సరైన పౌష్టికాహారాన్ని అందించాలని అన్నారు. అలాగే వారానికి మూడు రోజులు గుడ్లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, పాఠశాల స్థాయిలో మధ్యాహ్న భోజనానికి సంబంధించి నాణ్యత కొరకు పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసి వారి పేర్లను డిస్ప్లే బోర్డులపై పెట్టాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్యతరగతికి చెందిన విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన, పౌష్టికాహారాన్ని అందించేలా తగిన చర్యలు తీసుకొని, ఎప్పటికప్పుడు నిబంధనల ప్రకారం మధ్యాహ్నం భోజన పథకం సరిగ్గా అమలవుతుందో లేదో పర్యవేక్షించాలని కమలాపూర్ మండల విద్యాధికారితో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులను కోరారు. ఈ వినతి పత్రం ఇచ్చే కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కమలాపూర్ టౌన్ అధ్యక్షులు ఎడ్ల వెంకటేశ్వర్లు, అంబేద్కర్ సంఘం నాయకులు బొచ్చు కరుణాకర్, ఎగ్గడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామలింగేశ్వర రావు జాతర విజయవంతం

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

ఆమనగల్లు శ్రీ రామలింగేశ్వర మహిమ గల దేవుడు మరెక్కలేదని ఆమనగల్ లిఫ్ట్ చైర్మన్ మిర్యాల బిక్షమయ్య అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నలుమూలల నుండి భక్తులు శ్రీ పార్వతి రామలింగేశ్వర జాతరకు తండోపతండలుగా తరలి వచ్చారని చెప్పారు. కోరుకుంటే వరాలిచ్చే దేవుడుగా నమ్ముకున్న దైవంగా నిలిచిందన్నారు. ఆమనగల్లు కోవెలపై వెలసిన రామలింగయ్యకు ఏడుకొండల తిరుపతి వెంకన్న, ఆమనగల్లు కు తాళ్ల వెంకటేశ్వర్లు భక్తునికి ఏడుకొండల వెంకటేశ్వర్ల స్వామి అండగా ఉండి రామలింగేశ్వర స్వామి అభివృద్ధికి తాళ్ల వెంకటేశ్వర్లు పుట్టాడని కొనియాడారు. జిల్లా నలుమూలల ప్రతి ఒక్కరి మాట శ్రీ రామలింగేశ్వర మాట వినిపిస్తుందని అన్నారు. ఇంత వైభవంగా ఆమనగల్లు జాతర విజయవంతం చేసినందుకు ప్రత్యేకంగా తాళ్ల వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, W arangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, W arangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073